HICON SERIES

CLASS 5 TELUGU

# తెలుగు వెలుగు 5

## LESSON 6






CLICK HERE TO ACTIVATE

LESSON
PART 1

# 6 తెలుగు సొబగులు

1. తెలుగదేల యన్న దేశంబు తెలుగేను
తెలుగు వల్లభుండ, తెలుగొకండ
ఎల్ల నృపులు గొలువ నెరుగవే బాసాడి
దేశభాషలందు తెలుగు లెస్స



– శ్రీకృష్ణదేవరాయలు

2. తెలుగునేల పైన తిరుగాడునప్పుడు
తెలుగు మాట నోట బలికినపుడు
తెలుగు వారి కథలు తలపోసినప్పుడు
పొంగి పోదు గర్వమున నేను



– వేదుల సత్యనారాయణ శాస్త్రి

3. తీరి బంగారు పండెడు తెలుగునేల
తేట నీటితో ప్రవహించు తెలుగు నదులు
తెలుగు వాసిని ప్రకటించు తెలుగు గిరులు
తలచుకొన్నంత నామేను పులకరించు



4. తరిపి వెన్నెల ఆణిముత్యాల సొబగు
పునుగు జవ్వాజి ఆమని పూల వలపు
మురళి రవళుల కస్తూరి పరిమళములు
కలసి యేర్పడె సుమ్ము మా తెలుగు భాష

– నండూరి రామకృష్ణమాచార్య

5. తెనుగుదనము వంటి తీయందనము లేదు
తెనుగు కవుల వంటి ఘనులు లేరు
తెనుగు తల్లి సాధుజన కల్పవల్లిరా
లలిత సుగుణజాల ! తెలుగు బాల !



– జంధ్యాల పాపయ్యశాస్త్రి



## పద్య భావాలు

1. “తెలుగే గొప్పది. ఎందుకంటే, దేశం తెలుగుదేశం. నేను తెలుగు చక్రవర్తిని, తెలుగు వాడిని. తెలుగు కలకండలాంటి తీయనిది. అందరు రాజుల ముందు ఒట్టేసి చెబుతున్నా! దేశంలోని అన్ని భాషలకంటె తెలుగు భాషే గొప్పది” అని శ్రీకృష్ణదేవరాయలు చెప్పారు.
2. తెలుగు నేలలో తిరుగుతున్నప్పుడు, తెలుగు మాటలు పలుకుతున్నప్పుడు తెలుగు వారి గురించి తలచుకొన్నప్పుడు గర్వంతో ప్రతి తెలుగువాడూ పొంగిపోతాడు.
3. తెలుగు నేలపై బంగారు పంటలు పండుతాయి. నిర్మలమైన నీటితో తెలుగు నదులు ప్రవహిస్తున్నాయి. పర్వతాలు తెలుగు వారి ఉన్నతిని చాటుతున్నాయి. ఇదంతా తలచుకుంటే నా శరీరం పులకరిస్తుంది.
4. వెన్నెలలోని స్వచ్ఛత, ఆణిముత్యాలవంటి అందం, పునుగులోని సుగంధం, వసంత ఋతువు పూలసోయగాలు, వేణుగానంలోని మాధుర్యం, కస్తూరి సువాసనలు అన్నీ కలిసి తెలుగు భాష ఏర్పడింది.
5. ఓ తెలుగు బాల! తెలుగు వంటి తీయని భాష ఇంకొకటి లేదు. తెలుగు కవుల లాంటి గొప్ప కవులు ఇంకొకరు ఈ భూమిపై లేరు. తెలుగు తల్లి సజ్జనుల కల్పవృక్షం.



## అభ్యాసం

I. **అర్థాలు**

| | | | | | |
|---|---|---|---|---|---|
| ఏను | = | నేను | మేను | = | శరీరం |
| వల్లభుడు | = | చక్రవర్తి (రాజు) | సొబగు | = | అందం |
| కండ | = | కలకండ (పటికబెల్లం) | జవ్వాజి | = | సుగంధం |
| ఎల్ల | = | అందరు | ఆమని | = | వసంత ఋతువు |
| నృపులు | = | రాజులు | మురళి | = | వేణువు |
| బాస | = | ప్రతిజ్ఞ (ఒట్టు) | రవళి | = | ధ్వని |
| లెస్స | = | శ్రేష్ఠం (గొప్ప) | పరిమళము | = | సువాసన |
| తేటనీరు | = | స్వచ్ఛమైన నీరు | ఘనులు | = | గొప్పవారు |
| వాసి | = | ప్రసిద్ధి | కల్పవల్లి | = | కల్పవృక్షం |
| గిరులు | = | కొండలు | సాధుజనులు | = | సజ్జనులు |

II. **పదజాలం**

**(అ) ఈ క్రింది మాటలను ఉపయోగించి సొంతవాక్యాలు రాయండి.**

1. మాట – నోట

వాక్యం: ______________________

2. బంగారు – నేల

వాక్యం : ______________________

3. ఆమని – పూలు

వాక్యం : ______________________

4. మురళి – రవళి

వాక్యం : ______________________

5. ఆణిముత్యాలు – సొబగు

వాక్యం : ______________________

**(ఆ) వచనాలు రాయండి.**

| ఏకవచనం | బహువచనం | ఏకవచనం | బహువచనం |
|---|---|---|---|
| 1. నృపుడు | ________ | 4. ________ | ఘనులు |
| 2. ________ | కథలు | 5. రవళి | ________ |
| 3. నది | ________ | | |

**(ఇ) శ్రీకృష్ణదేవరాయలు మహారాజు. ఆయన తెలుగు వల్లభుడను అని చెప్పుకొన్నారు. నృపులలోకెల్ల గొప్పవాడు రాయలు.**

పై వాక్యాలను గమనించండి. వల్లభుడు, రాజు, నృపుడు అనే మాటలు "రాజు" అనే ఒకే అర్థాన్ని ఇస్తున్నాయి. ఇలా ఒకే అర్థాన్నిచ్చే మాటలను "పర్యాయ పదాలు" అంటారు. ఈ క్రింది మాటలకు పర్యాయపదాలను పట్టిక ద్వారా గుర్తించండి.

1. నేల 2. బాస 3. బంగారం. 4. గిరులు 5. పరిమళం 6. తల్లి

| | | | | | |
|---|---|---|---|---|---|
| భూమి | ప్రతిజ్ఞ | కొండలు | అమ్మ | సుగంధం | స్వర్ణం |
| ఒట్టు | కనకం | సువాసన | జనని | పర్వతాలు | ధరణి |

1. నేల = భూమి, ధరణి
2. బాస = ____________________
3. బంగారం = ____________________
4. గిరులు = ____________________
5. పరిమళం = ____________________
6. తల్లి = ____________________

**(ఈ) క్రింది పదాల వరుసను చూడండి. సంబంధం లేని పదాన్ని గుర్తించి, రాయండి.**

1. తెలుగునేల, తెలుగుకథ, హిందీభాష, తెలుగుమాట ____________________
2. వెన్నెల, ఆణిముత్యం, కస్తూరి, సూర్యుడు ____________________
3. తెలుగుతల్లి, చంద్రుడితల్లి, తెలుగుకవులు, తెలుగుదనము ____________________
4. కథ, రథం, పాట, పద్యం ____________________

## III. ప్రశ్నావళి

**(అ) ఈ క్రింది ప్రశ్నలకు రెండు లేక మూడు వాక్యాలలో జవాబులు రాయండి.**

1. శ్రీకృష్ణదేవరాయలు తెలుగు భాష గురించి ఏమని చెప్పారు ?
2. "పొంగిపోదు గర్వమున నేను" అను మాటలను బట్టి మీకేం అర్థమైందో రాయండి.
3. మీకు తెలిసిన కొందరు తెలుగు కవుల పేర్లు రాయండి.
4. తెలుగు భాష ఎలా ఏర్పడింది ?
5. వేటిని తలచుకుంటే శరీరం పులకరిస్తుందని వేదులవారు చెప్పారు ?

**(ఆ) ఈ క్రింది ప్రశ్నలకు ఆరు వాక్యాలలో జవాబులు రాయండి.**

1. తెలుగు భాష గొప్పతనాన్ని, తెలుగు భాష అందాలను మీ సొంతమాటల్లో రాయండి.
2. తెలుగుభాషలో మీకు నచ్చిన ఏదైనా ఒక పద్యం/గేయం/పాట రాయండి.

## IV. వ్యాకరణం

**ఈ క్రింది వాక్యాలను గమనించండి.**

మమత పద్యం పాడుతున్నది.

రాజు బంతితో ఆడుతున్నాడు.

ఆవు దూడకు పాలు ఇస్తున్నది.

పై వాక్యాలలో పనిని తెలిపే పదాలు పాడుతున్నది, ఆడుతున్నాడు మరియు ఇస్తున్నది. వీటినే క్రియలు అంటారని మనం ఇంతకుముందు తెలుసుకొన్నాం. ఇలాంటి క్రియలతో కూడి ఉన్న వాక్యాలను "**క్రియాసహిత వాక్యాలు**" అంటారు.

ఆహా! అద్భుతం.

మీదే ఊరు ?

విశాఖ విశాల నగరం.

అనంత ఆకాశంలో నక్షత్రాలు.

పై వాక్యాలలో క్రియా పదాలు లేవు. ఇట్లా వాక్యంలో క్రియలేని వాక్యాలను "**క్రియారహిత వాక్యాలు**" అంటారు.

**(అ) క్రియాసహిత, క్రియారహిత వాక్యాలు కొన్ని రాయండి.**

________________________________________

________________________________________

________________________________________

________________________________________

## V. ప్రాజెక్టు పని



తెలుగు భాషా మాధుర్యాన్ని తెలిపే ఏదైనా ఒక పాట లేదా గేయాన్ని సేకరించి, చార్టుమీద రాసి ప్రదర్శించండి. రాగ, భావ యుక్తంగా పాడండి.